క్లుప్తంగా

సొసైటీ చైర్మన్‌గా పూనాటి వెంకట్రావు

మేదరమెట్ల: రావినూతల సొసైటీకి నూతన పాలకమండలి సభ్యులు గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో సభ్యులుగా చేబ్రోలు నాగేశ్వరరావు, నాదెండ్ల తిరుపతిరావులు ఎంపిక చేశారు. కార్యక్రమానికి అధ్యక్షుడుగా కారుసాలనాగేశ్వరరావు, ప్రముఖ వైద్యులు డాక్టర్ హృదయనాథ్, మోపర్తి వెంకట్రావు, గురుబాబు, లక్ష్మీనారాయణ, చెంచు రామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీ



గోడౌన్‌లను పరిశీలిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ విజిలెన్స్ అధికారులు

అద్దంకి రూరల్: అద్దంకిలోని ఎరువుల దుకాణాల్లో గురువారం విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గురువారం తనిఖీలు నిర్వహించారు. దీనిలో భాగంగా ఎరువుల దుకాణాల్లో స్టాక్ రిజిస్టర్‌ను, రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే అమ్మకాలు నిర్వహించాలని సూచించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు విత్తానాలే అమ్మాలన్నారు. ఈ తనిఖీల్లో ఎన్టీఆర్ జిల్లా మైలవరానికి చెందిన ఏడీఏ శ్రీనివాసరావు, గుంటూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ విజిలెన్స్ సీఐ చంద్రశేఖర్, అద్దంకి వ్యవసాయ శాఖ ఏడీఏ ఎ్రప్రాయం, అద్దంకి మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణ పాల్గొన్నారు.

వైభవంగా పందిళ్లమ్మ తల్లి కొలుపులు



ఊరేగింపుగా పోతురాజు శిలకు తరలిస్తున్న శిడిమాను

వేటపాలెం: పందిళ్లపల్లి గ్రామం శివారులో పంట పొలాల్లో వేంచేసియున్న గ్రామ దేవత పందిళ్లమ్మ తల్లి కొలుపులు వైభవంగా జరుగుతున్నాయి. గురువారం స్టేజీ సెంటర్ వద్ద శిడిమానుకు రంగురంగుతో అలంకరించి పసుపు కుంకుమలతో పూజించి ఊరేగింపుగా పోతురాజు శిల వద్ద తరలించారు. రాత్రికి గ్రామంలో గ్రామోత్సవం నిర్వహించనున్నారు. మూడు రోజుల పాటు గ్రామంలో గ్రామోత్సవాలు నిర్వహిస్తారు. అనంతరం 19వ తేదీన శిడిమానును పందిళ్లమ్మ దేవస్థాన వద్దకు ఊరేగింపుగా తరలించి శిడిమహోత్సవం నిర్వహిచనున్నారు. 20న అమ్మవారి పొంగళ్ల చెల్లిపులతో కొలుపు ముగియనున్నాయి.

అనంతవరంలో విదేశీయుల పర్యటన



అనంతవరంలో పర్యటిస్తున్న విదేశీ ప్రతినిధులు

యద్దన పూడి: మండలంలోని అనంతవరం గ్రామంలో గురువారం బ్రిటన్, మలేషియా ప్రతినిధులు పర్యటించారు. బ్రిటన్‌కు చెందిన ఫిష్ మేన్ లియోనార్, మలేషియాకు చెందిన ఆడిల్ తెనెంజా, లియాలతో కలిసి అసిస్ట్ స్వచ్ఛంద సంస్థ యు. ఎల్టీసీ భాగస్వామ్యంతో నూతనంగా నిర్మించిన మరుగుదొడ్లను పరిశీలించారు. అనంతరం గ్రామ మహిళలతో మరుగుదొడ్ల వినియోగం వాటి ఆవశ్యకత గురించి వారికి అవగాహన కల్పించారు. అసిస్ట్ సంస్థ అసోసియేట్ డైరెక్టర్ మూర్తి, భరత్ రెడ్డి, నరసరాజు, పి. రవి బాబు, తారక రాం, వంశి పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

చినగంజాం: మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం ఉదయం 11 గంటలకు మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపీపీ కోమట్ల అంకమ్మరెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ విజయ తెలిపారు. సమావేశానికి మండల పరిధిలోని అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. మండలంలోని పలు అభివృద్ధి అంశాలకు సంబంధించి సమీక్ష జరుగుతుందని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

మార్టూరు: ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన జాతీయ రహదారి పక్కన గల సర్వీస్ రోడ్డులో గురువారం రాత్రి జరిగింది. 108 సిబ్బంది ప్రసాద్ వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఇసుక దర్శి ఎస్సీ కాలనీకి చెందిన చింతల యేసయ్య మార్టూరు నుంచి సర్వీస్ రోడ్డులో బైక్ పై స్వగ్రామం వెళ్తున్నాడు. స్థానిక ఏలూరి క్యాంపు కార్యాలయం సమీపంలో అదే మార్గంలో బైక్ పై వెళుతున్న ఓ యువకుడు యేసయ్యను బలంగా ఢీ కొట్టి వెళ్లిపోయాడు. గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

చంద్రబాబు మోసాన్ని ఎండగడతాం



కరపత్రాన్ని , క్యూ ఆర్ కోడ్‌ను ప్రదర్శిస్తున్న వెంకటేష్ బాబు, నాయకులు

వేటపాలెం: వైఎస్సార్ సీపీ శ్రేణులు ఇంటింటికీ తిరిగి చంద్రబాబు మోసాన్ని ఎండ గట్టేందుకు గ్రామాల్లో పర్యటించనున్నట్లు చీరాల నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ బాబు తెలిపారు. గురువారం వేటపాలెం మండలం రామన్నపేట గ్రామ పంచాయతీ వెనుక గల సమావేశంలో బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ పై వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. వెంకటేష్ బాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్ 6 హామీలను గాలికొదిలేసిందన్నారు. ఇప్పుడు సుపరిపాల అంటూ ఇంటింటికీ తిరిగి ప్రజలకు ఇచ్చిన హామీల వివరాలను క్యూర్ కోడ్ ద్వారా ప్రజల ముందు ఉంచుదామన్నారు. ఎలా మోసం చేశారో వివరిద్దామని పిలుపునిచ్చారు. గత ఏడాది జరిగిన ఎన్నికల్లో నియోజకవర్గానికి చెందిన వ్యక్తి మాజీ ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దయతో పక్క నియోజక వర్గానికి ఇన్‌చార్జిగా ఉన్నాడన్నారు. అయితే ఎన్నికల నాటికి పార్టీకి ఎన్నుపోటు పొడిచి చీరాల్లో పోటీ చేసి పార్టీ ఓటమి కారకుడయ్యాడని దుయ్యబట్టారు. ఎవరెవరు మనల్ని మోసం చేశారో గుర్తుంచుకోవాలన్నారు. రాబోవు కాలంలో వారి లెక్కలు సెటిల్ చేస్తానని హెచ్చరించారు. పార్టీలకు అతీతంగా అందరికీ గతంలో పనిచేశామని గుర్తు చేశారు. చేసిన రాజకీయాన్ని రాజకీయం గానే దెబ్బకొడతామన్నారు. పార్టీ కార్యకర్తలకు ఎప్పుడు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. త్వరలో ఇంటింటికీ బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీపై వివరిస్తామన్నారు. ఇలోపే చీరాల నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో మండల గ్రామ కమిటీలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. అయితే ఈ కమిటీల్లో ఉండాలనే అనుకునే వారు పోలీస్ కేసులకు, కూటమి ప్రభుత్వానికి భయపడే వారు మాత్రం ఉండవద్దని సూచించారు. పార్టీ కార్యక్రమాల్లో ఎటువంటి భయం లేకుండా పార్టీ పక్షాన పోరాడే వారికి పదవులు ఇస్తామని తెలిపారు. ప్రస్తుతం మండల, గ్రామ పార్టీ అనుబంధ పార్టీ పదవుల్లో ఎంపిక చేసిన వారికి మాత్రం పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత కూడా ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుందని హామీ ఇచ్చారు. మాజీ దేవాంగ కార్పొరేషన్ చైర్మన్ బీరక సురేంద్ర మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికల సమయంలో లెక్కకు మించి న హామీలు ఇచ్చి అమలు చేయకుండా ప్రజలను నిలువునా మోసం చేశారని విమర్శించారు. 14 నెలల్లోనే కూటమి ప్రభుత్వ పై ప్రజల నుంచి తీవ్రమైన వ్యతిరేకత వచ్చిందని తెలిపారు. రెడ్ బుక్ రాజ్యాంగం మాటున రాష్ట్రంలో అరాచకాలకు పాల్పడుతున్నారన్నారు. కార్యక్రమంలో చీరాల టౌన్ పార్టీ అధ్యక్షుడు యాతం మేరిబాబు, రామన్నపేట సర్పంచ్ కందేటి రమణ, ఉప సర్పంచ్ దంతం వెంకట సుబ్బారావు, బీసీ సెల్ కార్యదర్శి గవిని శ్రీనివాసరావు, మండల బీసీ సెల్ అధ్యక్షుడు సాదు రాఘవ, మండల మహిళా అధ్యక్షురాలు సీతామహాలక్ష్మి, యాతం మేరిబాబు కావూరి రమణా రెడ్డి, కర్ణ లక్ష్మణరావు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం..



మార్టూరు వెంకయ్య ఆశ్రమంలో వృద్ధులకు అన్నదానం నిర్వహిస్తున్న నాయకులు



పావులూరులో గాదె పుట్టిన రోజు కేక్ కట్ చేస్తున్న నాయకులు, కార్యకర్తలు



ఇంకొల్లులో మధుసూదన్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలు నిర్వహిస్తున్న నాయకులు

మార్టూరు: నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి గాదె మధుసూదన్ రెడ్డి జన్మదిన వేడుకలు గురువారం మండలంలో ఘనంగా నిర్వహించారు. మార్టూరు పట్టణ పార్టీ అధ్యక్షుడు అడగా గంగయ్య యాదవ్ ఆధ్వర్యంలో స్థానిక వెంకయ్య ఆశ్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి ఆశ్రమంలోని వృద్ధులకు స్వీట్లు పంపిణీ చేసి అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పఠాన్ కాలేషా వలి, పట్టణ ఉపాధ్యక్షులు నాగూర్ షరీఫ్, ముప్వా రామారావు, పార్టీ నాయకులు గర్నెపూడి రవిచంద్, గడ్డం మస్తాన్వలి, చిన్నా నాయక్ బుజ్జి నాయక్, నూక తోటి శామ్యూల్, ఎలీషా, మైలా చిన్న నాగేశ్వరరావు, అట్లూరి జైపాల్, అట్లూరి ప్రేమ్ రాజ్, దుడ్డు ప్రసన్న, గేరా మణి ప్రసాద్ ఆశ్రమ నిర్వాహకుడు తన్నీరు శివ రాజేష్ స్థానికులు పాల్గొన్నారు.

ఇంకొల్లు(చినగంజాం): పర్చూరు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ గాదె మధుసూదనరెడ్డి జన్మదిన వేడుకలు నియోజక వర్గ పరిధిలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఇంకొల్లులో మండల కన్వీనర్ చిన్ని పూర్ణారావు ఆధ్వర్యంలో గంగవరంలోని వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థూపం సెంటర్‌లో జన్మదినం పురస్కరించుకొని టపాసులు కాలుస్తూ కేక్‌ను కట్ చేసి మిఠాయిలు పంచి పెట్టారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ గాదె మధుసూదనరెడ్డికి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఎంపీటీసీ అయేషా బుడే, షంషుద్దీన్, సూభాని, ప్రసంగి, ఎంపీటీసీ రాజగోపాల్ రెడ్డి, సూరిబాబు, కోటి, శ్రీరాములు, ప్రతాప్ రెడ్డి, రాఘవేంద్ర, ప్రమోద్ రెడ్డి, చిట్టిబాబు, రవి, చక్రవర్తి, షడ్రక్, కేశవరావు, లతీఫ్ పాల్గొన్నారు.

ఇంకొల్లు(చినగంజాం): పర్చూరు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్, రాష్ట్ర కార్యదర్శి గాదె మధుసూదనరెడ్డి జన్మదిన వేడుకలు పావులూరు గ్రామంలోని ఆయన ఇంటి వద్ద గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. పుట్టిన రోజు కేక్‌ను కట్ చేసి ఆనందోత్సాహాల మధ్య అందరికీ పంచి పెట్టారు. జిల్లా అధికార ప్రతినిధి బండారు ప్రభాకరరావు, గ్రామ సర్పంచ్ బి. ఉధియమ్మ, ఎంపీటీసీ చిట్టిబాబు, సింహాద్రి సుబ్బారెడ్డి, జయరామిరెడ్డి, అంజిరెడ్డి, వీరభద్రరెడ్డి, రామాంజిరెడ్డి, చంద్రా రెడ్డి, కోటి శ్రీరాములు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం ఆషాఢ మాసం రేవతి నక్షత్రం అష్టమి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

విజయవాడ తరలిన కార్మికులు

అద్దంకి రూరల్: గత నాలుగు రోజులుగా సమ్మె నిర్వహిస్తున్న మున్సిపల్ ఇంజినీర్ కార్మికులు సమ్మెలో భాగంగా గురువారం అద్దంకి నుంచి విజయవాడ తరలి వెళ్లారు. సీఅండ్‌డీఎంఏ ఆఫీస్ వద్ద నిర్వహించిన ధర్నాలో పాల్గొన్నట్లు కార్మిక నాయకుడు శ్యామ్యూల్ తెలిపారు.

మార్జిలోకి దూసుకెళ్లిన కారు



మార్జిన్‌లోకి దూసుకెళ్లిన కారు

అద్దంకి: కారు డ్రైవరు నిద్రమత్తులోకి జారుకోవడంతో కారు మార్జిన్‌లోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో కారు నడపుతున్న వ్యక్తికి గాయాలు కాగా, అందులోని కుటుంబ సభ్యులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఈ ఘటన అద్దంకి –నార్కెట్‌పల్లి రాష్ట్రీయ రహదారిలోని సాధునగర్ వద్ద గురువారం జరిగింది. అందిన సమాచారం మేరకు ప్రకాశం జిల్లా తెల్లబాడుకు చెందిన సీహెచ్ ఆంజనేయులు కుటుంబం తిరుపతి నుంచి హైదరాబాద్‌కు వెళుతున్నారు. ఈ క్రమంలో కారు బాపట్ల జిల్లా అద్దంకి మండలంలోని సాధునగర్ వద్దకు రాగానే ఆంజనేయులు నిద్రమత్తులోకి జారుకోవడంతో కారు అదుపు తప్పి మార్జిన్‌లోకి దూసుకెళ్లింది. దాంతో ఆంజనేయులికి గాయాలయ్యాయి. భార్య వనజ, కూరుతు నవ్య, కుమరుడు నిఖిల్ స్వల్పగాయాలతో బయటపడ్డారు. స్థానికులు 108 కి ఫోన్ చేయడంతో క్షతగాత్రులను వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కారు పల్టీ కొట్టకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు చెబుతున్నారు.

డేటా నమోదు చేయించుకోండి

బల్లికురవ: ప్రతి పౌరుడు ప్రభుత్వ సేవలు పథకాల ద్వారా లబ్ధి పొందేందుకు తమ కుటుంబ వివరాలను ఆర్టీజీఎస్ లేదా జీఎస్‌డబ్ల్యూఎస్ డేటా బేస్‌లో నమోదు చేయించుకోవాలని ఎంపీడీఓ కుసుమ కుమారి తెలిపారు. నమోదు లేకుండా జనన, మరణ, ధ్రువీకరణ పత్రాలు రేషన్, పెన్షన్, ఆరోగ్య బీమా, నిర్మాణ అనుమతులు పొందటం కష్టమన్నారు. గ్రామ సచివాలయాల్లో డేటా నమోదు అయిందో లేదో పరిశీలించుకోవాలని కోరారు

కశ్యాపురం గ్రామ కమిటీ ఏర్పాటు



పెంట్యాల హనుమంతురావును అభినందిస్తున్న శ్రీను

జె.పంగులూరు: మండల పరిధిలోని కశ్యాపురం గ్రామంలో గురువారం నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో నూతనంగా గ్రామ కమిటీలు ఆధ్వర్యంలో నిర్వహించారు. కశ్యాపురం గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షునిగా నియమితులైన పెంట్యాల హనుమంతురావును మండల కన్వీనర్ రావూరి శ్రీనివాసరావు అభినందిచారు. గ్రామ అధ్యక్షునితో పాటు 6 మంది కమిటీ సభ్యులు, వారికి అనుబంధ కమిటీలుగా 15 మంది ఏర్పాటు చేశారు. నాయకులు జంపాని రాజా, మందా పురుషోత్తం, పటాన్ మౌలాలి, మట్టకోయ మహేష్, తలతోటి జాన్‌వెస్లీ పాల్గొన్నారు.

చినగంజాం ఎంపీడీఓగా విజయ

చినగంజాం: చినగంజాం ఎంపీడీఓగా ఎన్. విజయ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ప్రకాశం జిల్లా దోర్నాల ఎంపీడీఓగా పనిచేస్తున్న ఆమె బదిలీపై చినగంజాంలో జాయిన్ అయ్యారు. గతంలో ఎంపీడీఓగా పనిచేసిన శ్రీనివాసమూర్తి రిటైర్డ్ కావడం, ఆయన స్థానంలో ఇంకొల్లు ఎంపీడీఓ జి. శ్రీనివాసరావు పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహించారు. రెగ్యులర్ ఎంపీడీఓగా విజయ రావడంతో ఆయన తన బాధ్యతలను ఆమెకు అప్పగించారు.

బర్లీ పొగాకు రైతులు అధైర్య పడొద్దు

పర్చూరు(చినగంజాం): బర్లీ పొగాకు రైతులు అధైర్య పడాల్సిన అవసరం లేదని చివరి ఆకు వరకు కొనుగోలు చేస్తామని మండల వ్యవసాయశాఖాధికారి కె. భాస్కరరావు సూచించారు. ఐటీసీ, జీపీఐ, డెక్కన్ లాంటి కంపెనీలకు కంటే మెరుగుగా పొగాకు కొనుగోలు ప్రక్రియ మార్క్‌ఫెడ్ ద్వారా జరుగుతుందని ఆయన తెలిపారు. రైతులందరూ తాము న్న ప్రాంతంలో పొగాకును అమ్ముకునేలా ప్రభుత్వం 12 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని తెలిపారు. రైతులందరికీ వరుస క్రమంలో షెడ్యూల్ వస్తుందని ఎవరూ కూడా అధైర్య పడొద్దని సూచించారు.

చట్టాలపై అవగాహన అవసరం

అద్దంకి రూరల్: ప్రజలంతా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ అధ్యక్షుడు బాచిన శివధర పూర్ణచంద్రరావు అన్నారు. గురువారం స్థానిక క్లబ్ కార్యాలయంలో అంతర్జాతీయ న్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు మాట్లాడుతూ చట్టాలను గౌరవించాలన్నారు. కార్యక్రమంలో సెక్రటరీ అళహరి హరిప్రసాద్, ట్రెజరర్ గురుశఖర్, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఎంప్లాయీస్, పెన్షనర్ల విభాగం అధ్యక్షుడుగా రామారావు

చినగంజాం: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మార్కాపురం వెంకట రామారావును పర్చూరు అసెంబ్లీ నియోజక వర్గ ఎంప్లాయీస్, పెన్షనర్‌ల విభాగం అధ్యక్షునిగా నియమించారు. ఈ మేరకు తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి గురువారం ఉత్తర్వులు వెలువడ్డాయి.

రోడ్డు మార్జిన్‌లో వ్యర్థాలు



కలవకూరు రోడ్డు మార్జిన్‌లో వేసిన వ్యర్థాలు

అద్దంకి: నిత్యం పారిశుధ్యం అని చెప్పే అధికారులు.. రహదారులు డంపింగ్ యార్డుల్లా మారినా పట్టించుకోవడం లేదు. రోడ్డు మార్జిన్ల అపరిశుభ్రంగా మారుతున్నాయి. పట్టణంలోని దామావారిపాలెం నుంచి కలవకూరు రోడ్డు మార్జిన్‌లో పాత భవనాల వ్యర్థాలు, బట్టీ ఇటుక వ్యర్థాలతోపాటు చెత్తను డంప్ చేస్తున్నారు. దీంతో మార్జిన్ లేక రెండు వాహనాలు ఎదురెదురుగా వచ్చిన సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు రోడ్డుకు ఇరువైపులా వ్యర్థాలు వేయకుండా చూడాలని వాహనదారులు కోరుతున్నారు.

డొంక సమస్య పరిష్కారం



డొంకలో తోలిన మట్టిని జేసీబీ సహాయంతో తొలగిస్తున్న అధికారులు

జె.పంగులూరు: మండల పరిధిలోని చందలూరు, ఇంకొల్లు మండల పరిధిలోని కొనికి రెండు గ్రామాల మధ్య దీర్ఘకాలం వర్షపు నీరు పోకుండా ఉండే సమస్య పరిష్కారం అయింది. ఈ సమస్యను గురువారం పంగులూరు తహసీల్దార్ పి. సింగారావు, ఎస్సై వినోద్‌బాబు సర్వే చేసి సమస్యకు రైతులు సమక్షంలో పరిష్కారం చేశారు. తొలుత డొంకలో వర్షపు నీరు పోకుండా ఇరు గ్రామ రైతులు పోటీల మీద మట్టితోలారు. ఈ సమస్యపై 819 సర్వే నెంబర్ సర్వే చేసిన అధికారులు సరిహద్దు డొంకగా ఉందని రైతులకు తెలిపారు. వారి సమక్షంలో డొంకలో తొలిన మట్టిని జేసీబీ సహాయంతో తొలగించి రైతుల సమస్యను పరిష్కరించారు. రెవెన్యూ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పీఎంజేఏవై కార్డులకు ఈకేవైసీ



కుంకలమర్రులో పీఎంజేఏవై ఈ కేవైసీ చేయించుకుంటున్న గ్రామస్తులు

కారంచేడు: ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన పథకం నమోదు, కార్డుల కోసం ప్రతి ఒక్కరూ ఈకేవైసీ చేయించుకోవాలని కారంచేడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ గోరంట్ల సురేష్‌బాబు అన్నారు. గురువారం ఆయన మండలంలోని కుంకలమర్రు కల్యాణ మండపంలో ప్రకటించిన విధంగా ఈకేవైసీ ప్రత్యేక శిబిరం సందర్శించారు. గ్రామంలోని ప్రజలందరూ మీ ఆధార్ కార్డులను వెంట తెచ్చుకోవాలన్నారు. ఆధార్ నంబర్ ఆధారంగా ఈకేవైసీ చేసినట్లయితే వారికి కేంద్ర ప్రభుత్వం నుంచి పీఎంజేఏవై కార్డులు వారి అడ్రెస్‌కు వస్తాయన్నారు. వీటి ఆధారంగా ప్రభుత్వం నుంచి ఉచిత వైద్యసేవలు పొందేందుకు వీలుంటుందన్నారు. ఈశిబిరంలో ప్రతి ఒక్కరు వచ్చి మీ పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. వీటి వలన అనేకమైన ఆరోగ్య ప్రయోజనాలు, ఇన్సూరెన్స్ సదుపాయాలను పొందవచ్చన్నారు. హెల్త్ సూపర్‌వైజర్ డి. శ్రీనివాసరావు, పీహెచ్‌సీ పరిధిలోని అన్ని సచివాలయాల ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశాలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పొగాకు కొనుగోలు కేంద్రం పరిశీలన



పొగాకు కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ సింగారావు

జె.పంగులూరు: మండల పరిధిలోని పంగులూరు మార్కెట్ యార్డులో గత నెల 30వ తేదీ నుంచి ప్రారంభం అయిన పొగాకు కొనుగోలు కేంద్రాన్ని గురువారం తహసీల్దార్ పి. సింగారావు పరిశీలించారు. అధికారులను ఎంత మేరకు పొగాకు కొనుగోలు చేశారు. అనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు చేసిన పొగాకు బేళ్లను పరిశీలించారు. గత 17 రోజుల నుంచి పొగాకు కొనుగోలు కేంద్రంలో హెచ్‌డీఆర్ (మొదటి రకం) రూ. 12 వేలు చొప్పున 435 చెక్కులకు గాను 397.72 క్వింటాలకు రూ. 46,39,240 రైతులకు డబ్బులు చెల్లించాల్సి ఉంది. అదే విధంగా హెచ్‌డీఎం (రెండో రకం) రూ. 9 వేలు చొప్పున 961 చెక్కులకు గాను 839.65 క్వింటాలకు రూ. 75,56,850 , హెచ్‌డీఎక్స్ (మూడో రకం) 995 చెక్కులకు గాను 747.51 క్వింటాలు రూ.44,85,060 డబ్బులు రైతుల ధర పలికించినట్లు తెలిపారు. ఈ డబ్బులు త్వరలో రైతుల ఖాతాలోకి జమ అవుతాయిన తెలిపారు.

ఎన్నికలపై బీఎల్ఓలకు శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, మండలంలోని బీఎల్ఓలు

చినగంజాం: ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు మండల పరిధిలోని బీఎల్వోలకు గురువారం మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు ఆధ్వర్యంలో ఢిల్లీలో ప్రత్యేక శిక్షణ పొందిన ఏఎస్ఓ శ్రీమన్నారాయణ ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెమొక్రసీ అండ్ ఎలక్షన్ మేనేజ్‌మెంట్ అనే అంశంపై బీఎల్ఓలకు సమగ్ర శిక్షణ ఇచ్చారు. బీఎల్ఓ యాప్‌లో నమోదు చేసే విధానంపై శిక్షణ ఇస్తూ ఎలక్టోరల్ జాబితాను శుద్ధీకరణ చేసే విధానం వివరించారు. ఇంటింటి సర్వే నిర్వహించే కార్యక్రమంలో డ్రెస్ కోడ్ ఎలా ఉండాలి, మాట్లాడే పద్ధతి ఏ విధంగా ఉండాలనే విషయాలను స్కిట్ రూపంలో ప్రదర్శించారు. శిక్షణ అనంతరం బీఎల్ఓలకు పరీక్ష నిర్వహించగా అందరూ పరీక్షలో ఉత్తీర్ణత సాధించారు. ఉత్తీర్ణులందరికీ ప్రశంస పత్రాలను అందజేశారు. బీఎల్ఓలకు పలు సూచనలు చేశారు. ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ మాధవీ లత, వీఆర్వోలు, బీఎల్ఓలు పాల్గొన్నారు.

చేపల కోసం చెరువు నీరు ఖాళీ



అంబడిపూడి చెరువులో నీటిని బయటకు పంపుతున్న దృశ్యం

- ఆందోళనలో 6 గ్రామాల రైతులు
- మరమ్మతులకు గురైన బోర్లు

బల్లికురవ: వర్షాభావ పరిస్థితుల్లో సాగు నీరు మాట అటుంచితే.. కనీసం తాగేందుకు కూడా కటకటలాడాల్సిన పరిస్థితులు దాపురించాయి. పరిస్థితి ఇలా ఉంటే ఉన్న కొద్దిపాటి నీరు కూడా అందకుండా చేస్తున్నారు. చెరువుల్లో ఉన్న కొద్దిపాటి నీటిని చేపలు పట్టుకునే నిమిత్తం.. కాంట్రాక్టర్ ఆయిల్ ఇంజన్‌లు, మోటార్లతో నీటిని బయటకు పంపిస్తూ వాగుల పాలు చేస్తున్నారు. మండలంలోని అంబడిపూడి గ్రామ సమీపంలో సుమారు 120 ఎకరాల్లో చెరువులు విస్తరించి ఉన్నాయి. వీటిలో సుమారు 20 ఎకరాలను మంచినీటి స్టోరేజ్ చెరువుకు కేటాయించారు. మిగిలిన చెరువు భాగంలో చేపల పెంపకంతోపాటు నీటి నీరు నిల్వ చేస్తున్నారు. అలాగే 6 గ్రామాల పరిధిలోని 1200 ఎకరాలకు ఈ నీరు అందించేందుకు పథకం ఏర్పాటు చేశారు. అయితే నీటిని బయటకు పంపకుండా చేపలు పట్టుకోవాలనే నిబంధనలు ఉన్నా కాంట్రాక్టర్ బేఖాతర్ చేస్తున్నారు. చెరువులో చేపలు వేసి పెంచుకునేందుకు గత ఏడాది లీజుకు తీసుకున్న సదరు వ్యక్తి నిబంధనలు అతిక్రమిస్తూ నాలుగు రోజులుగా నీటిని వాగులపాలు చేస్తున్నాడు. ఈమేరకు పెద అండిపూడి, చినఅంబడిపూడి, గుంటుపల్లి, కొత్తపాలెం, బల్లికురవ, నక్కబొక్కలపాడు గ్రామాలైప గ్రామాల రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. చెరువులో నీరు లేకపోగా గ్రామాల్లో మంచినీటి బోర్లు మొరాయిస్తున్నాయని నీటి నిల్వకే ప్రాధాన్యత ఇవ్వాలని రైతులు వేడుకుంటున్నారు.